ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కర్ణాటక వార్తలు

శుక్రవారం 14 నవంబరు 2025



బళ్లారి కార్పొరేషన్ కార్యాలయం

నగర పీఠం దక్కేదెవరికి.?

● రేపు బళ్లారి మేయర్, ఉపమేయర్ ఎన్నికలు

6



ఆంగ్లంపైనే మోజు

● ఆంగ్ల మీడియానికి ప్రోత్సాహం... కన్నడ అభ్యర్థులకు అన్యాయం
● మాతృభాషలో కేఏఎస్ రాసినవారికి ఎడతెగని కష్టాలు
● పరీక్ష నిర్వహణలో అవకతవకలు..ప్రశ్నాపత్రాల్లో తప్పులు
● ఫలితాల కోసం ఎదురుచూపులు ● నెరవేరని సీఎం హామీ

బెంగళూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ వంటి ఉన్నత హోదాలు దక్కాలంటే గ్రూప్-1 యూపీఎస్సీ పరీక్షలు రాయాల్సిందే. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఎంతో శ్రమించాల్సి ఉంటుంది. అయితే ఆ స్థాయిలో పోటీ పడలేనివారు రాష్ట్రస్థాయిలో ఉన్నత హోదాలో అవకాశం కోసం కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ (కేపీఎస్సీ) పరీక్షలు రాయడం పరిపాటి. కేపీఎస్సీ పరీక్షల ద్వారా గ్రూప్ ఏ, బీ, సీ డీ కేటగిరీ పోస్టులు భర్తీ చేస్తారు. వీటిలో ప్రధానమైనది కర్ణాటక అడ్మినిస్ట్రేటివ్ ఎగ్జామ్ (కేఏఎస్). ఇందుకు మూడు స్టేజ్‌లలో ఎంపిక ప్రక్రియ ఉంటుంది. గ్రూప్ పరీక్షల తరహాలో ప్రిలిమ్స్ (ఆబ్జెక్టివ్ టైప్), మెయిన్స్ (డిస్క్రిప్టివ్), ఇంటర్వ్యూ ఉంటాయి. ఇతర పరీక్షల ద్వారా ఫస్ట్ డివిజన్ అసిస్టెంట్ (ఎఫ్‌డీఏ), సెకండ్ డివిజన్ అసిస్టెంట్ (ఎస్‌డీఏ), సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎక్సైజ్), టీచర్, జూనియర్ ట్రైనింగ్ ఆఫీసర్ పోస్టులకు ఎంపిక కావచ్చు.


బెంగళూరులోని కేపీఎస్సీ కేంద్ర కార్యాలయం

కేఏఎస్ ఫలితాలు

సంవత్సరం	కన్నడ	ఉత్తీర్ణులు	ఆంగ్లం	ఉత్తీర్ణులు
2010	3,294	134	994	134
2011	4,815	137	2,695	225
2014	4,678	198	3,690	266
2015	4600	115	3,441	313
2017-18	530	10	1168	96

కేఏఎస్ కీలకం

కేపీఎస్సీ పరీక్షలను కన్నడభాషలో రాసే అవకాశం కూడా ఉంది. అయితే కేవలం 10శాతం కంటే తక్కువగా ఎంపికవుతున్నారు. ఇంగ్లీష్ మీడియంలో రాసేవారు 90శాతం కంటే అధికంగా ఉత్తీర్ణత సాధిస్తున్నారు. దీంతో ఆంగ్ల మీడియానికి ప్రోత్సాహం, కన్నడ మీడియానికి నిరుత్సాహం అనేలా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం కన్నడ మీడియంలో మెయిన్స్ రాసిన పరీక్షల ఫలితాలకోసం ఎక్కువకాలం వేచియుండాల్సి వస్తోందని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. కేఏఎస్‌లో ఉత్తీర్ణత సాధిస్తే జిల్లా, రాష్ట్రస్థాయి ఉన్నత హోదాలు సాధ్యం. కేఏఎస్ అధికారిగా రాణిస్తే ఐఏఎస్ వంటి హోదాలకు పదోన్నతి పొందే అవకాశం ఉంది.

తప్పుల తడకగా ప్రశ్నాపత్రాలు

కన్నడ మీడియం ప్రశ్నాపత్రంలో లోపాలు, మౌల్యమాపనం (వాల్యుయేషన్) సక్రమంగా జరగడం లేదనే ఆరోపణలతో ఏటా కన్నడమీడియంలో పరీక్షలు రాసే వారి సంఖ్య తగ్గుతోంది. 2015లో కన్నడ మీడియంలో 4,600 మంది అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలు రాశారు. 115మంది ఉత్తీర్ణత సాధించారు. అయితే ఆంగ్లమాధ్యమంలో 3,441 మంది పరీక్షలు రాయగా 313మంది ఎంపికయ్యారు. 2017-18లో 530మంది కన్నడ మీడియంలో రాగా 10మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఆంగ్ల మీడియంలో 1,168 మంది పరీక్షలు రాయగా 96మంది ఉత్తీర్ణులయ్యారు.

ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన అభ్యర్థులు

ఇక 2024 ఆగస్టు 27న కేఏఎస్ ప్రిలిమ్స్ పరీక్షలు జరిగాయి. భాషా అనువాదం సమస్య కారణంగా కన్నడ మీడియం ప్రశ్నాపత్రంలో 50శాతానికిపైగా లోపాలు బయట పడ్డాయి. అప్పట్లో కన్నడమీడియం అభ్యర్థులు బెంగళూరులో నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి సూచన మేరకు కేపీఎస్సీ పరీక్షను రద్దు చేశారు. డిసెంబరులో మళ్లీ పరీక్షలు నిర్వహించారు. అప్పుడు కూడా కన్నడ ప్రశ్నాపత్రంలో పొరపాట్లు వచ్చాయి. ఈ కారణంగా మళ్లీ పరీక్షలు జరపాలనే డిమాండ్ వచ్చినా అది అమలు కాలేదు. దీంతో అభ్యర్థులు కర్ణాటక అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (కేఏటీ)ని ఆశ్రయించారు.

● 2025 మేలో కేఏఎస్ మెయిన్స్ పరీక్షలు జరిగాయి. ఇంతవరకు మౌల్యమాపనం జరగలేదు. ఫలితాలు ఎప్పుడనేది అగమ్యగోచరంగా ఉంది. ఈ తరుణంలో కన్నడ మీడియం అభ్యర్థులు అన్యాయం జరగరాదని కోరుతూ ముఖ్యమంత్రికి లేఖ రాశారు.



ప్రధాన డిమాండ్లు ఇవే..

కేఏఎస్‌కు సంబంధించి ఇంగ్లిష్ ప్రశ్నాపత్రాన్ని అనువాదం చేయకుండా నేరుగా కన్నడలోనే ప్రశ్నాపత్రాన్ని రూపొందించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. కన్నడ మీడియంలో పరీక్షలు రాసేవారికి అదనంగా 20 నిమిషాలు కేటాయించాలి. కన్నడ మీడియం ఎవాల్యుయేటర్స్‌ను నియమించాలి. లోటుపాట్లు లేకుండా పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు తరచూ డిమాండ్ చేస్తున్నారు.

భరోసా ఇచ్చిన సీఎం

కన్నడ మీడియంలో కేఏఎస్ పరీక్షలు రాసిన అభ్యర్థుల నిరసన సందర్భంగా సీఎం సిద్దరామయ్య భరోసా ఇచ్చారు. కన్నడలో పరీక్ష రాసినవారికి న్యాయం కల్పించేలా చర్యలు చేపట్టాలని తద్వారా కన్నడభాషపై ప్రేమను చాటుకోవాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. నోటిఫికేషన్లలో వయోపరిమితి పెంచాలన్నారు.

రేపు ఢిల్లీకి సీఎం



బెంగళూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బిహార్ ఎన్నికలు ముగియగానే రాష్ట్రంలో మార్పులు చోటు చేసుకుంటాయని, అవి ఏస్థాయిలో ఉంటాయనేది ఇప్పుడే చెప్పలేమనే చర్చలు నాలుగైదు నెలలుగా సాగుతున్న విషయం తెలిసిందే. ఇటీవల రెండుమూడు వారాలుగా సీఎం సిద్దరామయ్య కూడా బిహార్ ఎన్నికల తర్వాత 15వ తేదీన ఢిల్లీ వెళతానని అన్ని విషయాలు అధిష్ఠానం పెద్దలతో చర్చిస్తానని వెల్లడించారు. కానీ శుక్రవారం ఏమి జరుగుతుందోనని కాంగ్రెస్‌వర్గాలలో నెలకొన్న ఉత్కంఠ ఉసూరు మనిపించేలా ఉంది. సీఎం సిద్దరామయ్య శుక్రవారం మధ్యాహ్నం 11గంటలకు ఢిల్లీకి బయల్దేరనున్నారు. మధ్యాహ్నం 2గంటలకు అక్కడికి చేరకుని అందుబాటులో ఉండే కేంద్రమంత్రులతో చర్చలు జరిపే అవకాశం ఉంది. సాయంత్రం 6గంటలకు సుప్రీం కోర్టు న్యాయవాది, సీనియర్ కాంగ్రెస్‌నేత కపిల్‌సిబల్‌కు సంబంధించిన జీవిత చరిత్రపై రూపొందిన పుస్తకావిష్కరణలో పాల్గొంటారు. అక్కడ కార్యక్రమాలు ముగిసే సరికే రాత్రి 9గంటలు కానుంది. రాత్రి 10గంటలకు ఢిల్లీ నుంచి బెంగళూరుకు బయలుదేరుతారు. దీనిని బట్టి కాంగ్రెస్ అధిష్ఠానంతో చర్చలు జరిపే అవకాశమే లేదని తెలుస్తోంది. కపిల్‌సిబల్ పుస్తకావిష్కరణలో కాంగ్రెస్ పెద్దలు పాల్గొనినా సభలో మాట్లాడేది సమయం ఉండదనేది తెలిసిందే.

18న దుర్గాదేవి జాతర


అలంకరణలో దుర్గాదేవి

కంప్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గంగావతి పట్టణంలో వెలసిన దుర్గాదేవి జాతర మహోత్సవాలు 18 నుంచి 21వరకు నిర్వహిస్తామని దుర్గాదేవి ఆలయ కమిటీ పదాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 18న పూర్ణకుంభం ఊరేగింపు, 19న దుర్గా సప్తశతి పారాయణం, 20న నవచండీ హోమం, శోభాయాత్ర 21న దుర్గాదేవి జాతర, నిర్వహించనున్నారు. జాతర మహోత్సవాలకు భక్తులు విశేషంగా తరలిరావాలని, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.


మేళాలో పంట ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న కేంద్రమంత్రి శోభాకరంద్లాజె, రాష్ట్రమంత్రి చలువరాయ స్వామి తదితరులు

పరిశోధనలతోనే ప్రపంచస్థాయికి

● మంత్రి చలువరాయస్వామి

● శాస్త్రవేత్తల కృషితోనే ఎన్నో దేశాలకు ఎగుమతి సాధ్యమైందని ప్రశంసలు
● ఘనంగా కృషిమేళా ప్రారంభం
● భారీగా తరలివచ్చిన రైతులు, సందర్శకులు

బెంగళూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మూడుదశాబ్దాల కిందట అమెరికాతో పాటు పలుదేశాల నుంచి గోదుమలను దిగుమతి చేసుకునేదని, కానీ వ్యవసాయ విశ్వవిద్యాలయాల నిరంతర పరిశోధనలు, శాస్త్రవేత్తల సాధనలతోనే నేడు మన దేశం ఎగుమతి చేసే స్థాయికి ఎదగడం గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి చలువరాయ స్వామి అన్నారు. గాంధీకృషి విజ్ఞానకేంద్రానికి అనుబంధంగా ఉండే వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2025 కృషిమేళాను గురువారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కేంద్రమంత్రి శోభాకరంద్లాజెతో పాటు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఎస్‌వీ సురేష్ తదితరులు పాల్గొన్నారు. రైతులు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ప్రతినిధులు, అగ్రికల్చర్, హార్టికల్చరల్ కోర్సులు చేస్తున్న విద్యార్థులను ఉద్దేశించి మంత్రి చలువరాయస్వామి మాట్లాడుతూ దేశంలో 75 వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయని అందులో 11వదిగాను కర్ణాటకలో ప్రథమస్థానంలో ఉండే వ్యవసాయవిశ్వవిద్యాలయం 60వ వసంతాలు ముగించుకోవడమనేది గర్వకారణమన్నారు. ఎన్నో కొత్త రకాల వంగడాలు, వ్యవసాయ పనిముట్లు అందుబాటులోకి తీసుకువచ్చి అన్నదాతలకు అండగా నిలిచిందన్నారు. వ్యవసాయం అనేది పరిశ్రమగా మారితేనే మనుగడ సాధ్యమన్నారు. యువరైతులు స్టార్టప్‌లకు అనుకూలంగా ఉండేలా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడుతున్నాయన్నారు. ఐదువేల వ్యవసాయ పరిశ్రమలకు కేంద్రం నుంచి తొమ్మిదిలక్షలు, రాష్ట్రం నుంచి ఆరులక్షలు ప్రోత్సాహంగా అందిస్తున్నట్లు తెలిపారు. చెరుకు కోత యంత్రం కొనుగోలుకు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ.50లక్షలు, ఇతరులకు 40లక్షలు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ఫిలిప్పైన్స్ దేశానికి వెళ్లామని అక్కడ వరి పరిశోధనా కేంద్రాన్ని సందర్శించామన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పంటలు దెబ్బతినకుండా ఎదుర్కొనే వంగడాలు ప్రస్తుతసమాజానికి అవసరమని మంత్రి వెల్లడించారు. కేంద్రమంత్రి శోభాకరంద్లాజె మాట్లాడుతూ ఒకప్పుడు విదేశాల నుంచి ఆహారధాన్యాలు దిగుమతి చేసుకునేవారమని కానీ ప్రస్తుతం దేశంలోని 140కోట్ల మందికి సరిపడా ఆహారం సమకూరడంతో పాటు మిగులుగా వివిధ దేశాలకు ఎగుమతి చేసే స్థితికి చేరామంటే పంట దిగుబడులు అధికంకావడమే కారణమన్నారు. పంటలు సాగుచేయడంతోనే సరిపోదని తగిన మార్కెటింగ్ కూడా ముఖ్యమేనన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు పెంచడం ద్వారా కొంతకాలం పంటలను నిలువ ఉంచుకోవడంతో పాటు ఎగుమతులకు వీలుంటుందన్నారు. అందుకోసమే 13వేల యూనిట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. మధ్యప్రాచ్యదేశాలకు అవసరమైన పంట ఉత్పత్తులను ఎగుమతి చేయడం ముఖ్యమన్నారు. విత్తనరాగుల కోసం కొన్ని దేశాలు ప్రయత్నిస్తున్నాయని అటువంటివి పండించాలన్నారు. కృషిమేళాల ద్వారా ఎలా పంటల సాగు చేయాలని కొత్తవంగడాలు, ఆధునిక యంత్రాల గురించి రైతులకు నేరుగా అవగాహన కల్పించేందుకు వేదికగా మారుతున్నాయని కితాబునిచ్చారు. దక్షిణభారత్‌లోనే జీకేవీకే కృషిమేళా ప్రముఖమైనదిగా దశాబ్దాల కాలంగా కొనసాగుతూ రైతులకు ఆదర్శంగా నిలవడం గర్వ కారణమన్నారు. ఈ సందర్భంగా ఎందరో వ్యవసాయ శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. నిరంతరం పరిశోధనలు కొనసాగాలన్నారు.

కెనరాబ్యాంక్ ఆధ్వర్యంలో ఉత్తమ రైతులకు సత్కారం

కెనరాబ్యాంక్ ద్వారా ఇద్దరు రాష్ట్ర స్థాయి ఉత్తమరైతులను సత్కరించారు. రామనగర్ జిల్లా లక్ష్మీపురంకు చెందిన ఎల్ శివరాజు, కోలార్ జిల్లా కెంజిగనహళ్ళికి చెందిన పద్మినిలకు ప్రత్యేక బహుమతితో పాటు ఘనంగా సన్మానం చేశారు. మాజీ ప్రధాని దేవెగౌడ పేరిట కోలార్ తాలూకా ఎంఎన్ రవిశంకర్‌కు మామిడి సాగులో ప్రత్యేకతలపై సత్కరించారు.


మేళాలో సెల్ఫీల సందడి


ఉత్తమ రైతులను సత్కరిస్తున్న కెనరా బ్యాంకు అధికారులు

కొత్త వంగడాల ఆవిష్కరణ

వ్యవసాయ విశ్వవిద్యాలయం గాంధీకృషి విజ్ఞాన కేంద్రం రూపొందించిన ఐదు కొత్తవంగడాలను కృషిమేళాల్లో ఆవిష్కరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను యూనివర్శిటీ చాన్స్‌లర్ ఎస్‌వీ సురేష మీడియాకు వెల్లడించారు.

● సూర్యకాంతిలో కెబిఎస్‌హెచ్-88 వంగడం 84-88 రోజుల్లోనే కోతకు వస్తుందని దిగుబడి ఎకరాకు 9-10 క్వింటాళ్ళు కాగా నూనెశాతం 15-40శాతం ఉంటుందని రోగ నిరోధకశక్తి కలిగి ఉంటుందన్నారు.

● ఇక జొన్నలో సీఎన్‌జీఎస్-1 రకం 100-105 రోజులలో కోతకు వస్తుందని ఎకరాకు 15-17 క్వింటాళ్ళుకాగా గడ్డి 12-14 క్వింటాళ్ళు ఉంటుందని కోతకు వచ్చేదశదాకా పచ్చరంగులోనే పంట ఉంటుందని తద్వారా పశుగ్రాసానికి అనుకూలమన్నారు.

● ఇక బీసీహెచ్ ఆముదం రకం ఎకరాకు 8-10 క్వింటాళ్ళుగా ఉంటుందని చెట్టునిండా ఆముదం కాయల గొనలు ఉంటాయని గింజలలో పగుళ్ళు ఉండవన్నారు.

● పసుపులో ఐఐఎస్ఆర్ ప్రతిభ కాల వ్యవధి 240-245 రోజులలో కోతకువస్తుందని, ఎకరాకు 144-152 క్వింటాళ్ళు ఉంటాయన్నారు. నల్లపసుపు సీహెచ్‌ఎన్‌బిటీ-1 రకం 255- 265 రోజులకు కోతకు వస్తుందన్నారు. ఎకరాకు 40-48 క్వింటాళ్ళు సాధ్యమన్నారు. పసుపుకొమ్ములు బలంగాను పెద్దసైజులో ఉంటాయన్నారు.


ప్రదర్శనలో ఉంచిన నూతన వంగడాలు



సమావేశంలో మంత్రులు బోసరాజు, డాక్టర్ సుధాకర్ తదితరులు

ప్రాధికార అభివృద్ధికి సహకారం

● సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి ఎన్ఎస్ బోసరాజు

బెంగళూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ హెచ్ నరసింహయ్య సైన్స్, విద్య, సాంస్కృతిక, పర్యాటక అభివృద్ధి ప్రాధికార సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం తగిన సహకారం ఇస్తుందని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి, రాష్ట్రస్థాయి సలహా సమితి ఎక్స్ అఫిషియో ప్రెసిడెంట్ ఎన్ఎస్ బోసరాజు తెలిపారు. ప్రాధికార రాష్ట్రస్థాయి సలహా సమితి తొలి సమావేశం నగరంలోని ఎంఎస్ బిల్డింగ్‌లో గురువారం జరిగింది. సమావేశంలో సలహా సమితి ఎక్స్ అఫిషియో వైస్ ప్రెసిడెంట్, మంత్రి డాక్టర్ సుధాకర్, ప్రాధికార అధ్యక్షులు ఎన్ హెచ్ శివశంకరరెడ్డి, ఐటీబీటీ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల కార్యదర్శులు (మిగతా 7వ పేజీలో)

జీవనశైలిలో మార్పు తప్పనిసరి

● ఇండియా ఆయుర్వేద ఫౌండేషన్ అధ్యక్షుడు సీఏ కిశోర్ ● లేకపోతే మధుమేహం కష్టాలు తప్పవని హెచ్చరిక



బెంగళూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ జీవనశైలిని మార్చుకోవాలని, లేకపోతే మధుమేహ కష్టాలు తప్పవని, నవంబరు 14 అంటే అందరూ బాలల దినోత్సవంగా భావిస్తారని, అంతకుమించి సమాజంలో ప్రపంచ మధుమేహ నివారణ దినం అనేది గుర్తుంచుకోవాలని ఇండియా ఆయుర్వేద ఫౌండేషన్ అధ్యక్షుడు సీఏ కిశోర్ అన్నారు. మధుమేహ రాజధానిగా భారత్ పరుగులు తీస్తోందని ఇది సున్నితమైన అంశం కాదని ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు. సులభతరం, సుఖం కోరుకుంటే ఆ తర్వాత కష్టాలు తప్పవన్నారు. పిజ్జాలు, పేస్ట్రీ, కేక్‌లు తినడం అనేది ఫ్యాషన్‌గా మారిపోతోందని, తద్వారా ఆరోగ్యంపై ఎంతటి ప్రభావం చూపుతుందనేది తెలుసుకోలేకపోతున్నారన్నారు. ప్రతివారాంతం బెంగళూరులో హోటళ్లలో గిజగిజలాడతారని, కనీసం కూర్చునేందుకు క్యూ కడుతున్నారని ఇదెక్కడి పరిణామం అన్నారు. సుఖం పెరిగితే ఆయుష్షు తగ్గుతుందనేది తెలుసుకోవాలన్నారు. అత్యవసరమైతే అంబులెన్స్ కూడా ఆలస్యం అవుతోందని అంతకంటే పిజ్జా సులభంగా డెలివరీ అవుతోందన్నారు. ఒకప్పుడు శ్రీమంతులకు విలాసవంతమైన జీవితం గడిపేవారికి మాత్రమే మధుమేహం వస్తుందనేది ప్రచారంలో ఉండేదన్నారు. ప్రస్తుతం పుట్టినబిడ్డలు కూడా షుగర్‌తో ఇబ్బంది పడుతున్నారన్నారు. వంశపారంపర్య లక్షణాలు పెను ప్రభావం చూపుతున్నాయన్నారు. తల్లిదండ్రులు పిల్లల దినోత్సవాన వారి సంతోషంతోపాటు జీవనశైలిలో మార్పు తీసుకొచ్చేందుకు చొరవ చూపాలన్నారు. ఎత్తును బట్టి బరువు ఉండాలని, అది మరొకరు నిర్ధారించేది కాదని, ఎవరికి వారు వారి ఆరోగ్యంపట్ల పాటించాల్సి ఉందన్నారు. సినిమాకు వెళ్లినప్పుడు ఏదో సరదాగా తినేలా, బడికి వెళ్లినప్పుడు పిల్లలకు అటువంటి జంక్ ఫుడ్‌లు ఇస్తున్నారన్నారు. వేడుక ఏదైనా కేక్ ఆవు రావురమంటూ తినేస్తున్నారు. స్వీట్‌లు అంటే లెక్కలేకుండా ఆరగిస్తున్నారన్నారు. మధుమేహంతో వచ్చే సమస్యలు జీవితకాలం వెంటాడతాయన్నారు. చిన్నపాటి గాయమైనా నయమయ్యే వరకు ఎన్నో పద్ధతులు పాటించాల్సి ఉంటుంది. నరాల బలహీనత కంటిచూపుతోపాటు శరీంలోని ప్రతిభాగంపైనా మధుమేహమే కమాండ్ చేస్తుంది. కొత్తగా పెళ్లి చేసుకున్నవారిలో మధుమేహం ఉంటే వారికి సంతానలేమి సహా ఎన్నెన్నో సమస్యలు ఎదుర్కొవాల్సి ఉంటుందన్నారు. ఒక్కసారి మధుమేహం వచ్చిందంటే జీవనశైలి, మైండ్‌సెట్, ఆహారపు పద్ధతులు, మందులు నిరంతరంగా వాడాల్సి ఉంటుందన్నారు. జీవితకాలం పలు సమస్యలు వేధిస్తాయన్నారు. ప్రతిరోజూ చావు బతుకుల మధ్య ఉన్నట్టే భయాందోళనకు కారణమవుతుందన్నారు. మధుమేహం సోకినవారికి ఎటువంటి జబ్బులు వచ్చినా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఎటువంటి సందేహాలకైనా 8050010100కు సంప్రదించాలన్నారు.


శారీరక పరీక్షల కోసం క్యూలో వేచివున్న అభ్యర్థులు

తరలివచ్చిన అగ్నివీర్‌లు

● బళ్లారిలో అగ్నివీర్ నియామక ర్యాలీ ప్రారంభం
● 14 జిల్లాల నుంచి తరలివచ్చిన అభ్యర్థులు

బళ్లారి సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లాస్టేడియంలో గురువారం నుంచి ప్రారంభమైన అగ్నివీర్ నియామక ర్యాలీగా అభ్యర్థులు భారీగా తరలివచ్చారు. ర్యాలీ ఐదురోజుల పాటు జరగనుంది. రాష్ట్రంలోని 14జిల్లాల నుంచి యువత ఇందులో పాల్గొన్నారు. భారత సైన్యంలో ఖాళీగా ఉన్న అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులను భర్తీ చేయడానికి ఈ ర్యాలీ నిర్వహిస్తున్నారు. 30జూన్ 2025నుంచి 10 జూలై 2025వరకు జరిగిన ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్షల్లో అర్హత (మిగతా7వ పేజీలో..)



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.96	1631.52
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,880	3,971
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,193	10,062
నీటి నిల్వ (టీఎంసీలు)	76.35	99.90

కర్ణాటక రాష్ట్ర సహకార రత్న ప్రశస్తికి

ఎంపికైన ధనుంజయ



బళ్లారి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్) మాజీ డైరెక్టర్ ధనుంజయ అమల్‌కు 2025-26 ఏడాదికి కర్ణాటక రాష్ట్ర సహకార రత్న ప్రశస్తికి ప్రభుత్వం ఎంపిక చేసింది. ధనుంజయ అమల్ కో-ఆపరేటివ్ సెక్టార్‌లో ఉంటూ అనేక సేవలు అందించారు. కేఎంఎఫ్ డైరెక్టర్‌గా ఉన్న కాలంలో సంస్థ అభివృద్ధికి ఎనలేని సేవలందించారు. ఆయన సేవలు గుర్తించి ప్రభుత్వం ఆయనకు కర్ణాటక రాష్ట్ర సహకార రత్న ప్రశస్తికి ఎంపిక చేసింది. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి సేవలు అందించే వారికి ఇచ్చే ప్రశస్తిని తనకు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఇక నుంచి బాధ్యతలు మరింత పెరిగాయన్నారు. రాష్ట్రంలో అతి చిన్న వయస్సులో ఈ అవార్డు వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రేఖ



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సిరుగుప్ప నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రేఖ అనే విద్యార్థిని గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. తాలుకాలోని రారావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని రేఖ అథ్లెటిక్స్‌లో విజయం సాధించడంతో పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు వీరణ్ణ, ఉపేంద్ర, చెన్నప్ప, విద్యార్థినిని అభినందించారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ



ఆస్పత్రిని పరిశీలిస్తున్న వైద్యాధికారి రమేష్

సిరుగుప్ప నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యాధికారి యల్లా రమేష్ టెక్కలకోట ప్రభుత్వాస్పత్రిని గురువారం తనిఖీ చేశారు. గర్భిణులకు అందిస్తున్న సేవలపై వైద్యులను ఆరా తీశారు. పౌష్టికాహారం, ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయాలని ఆయన సూచించారు. మందుల కొరత వుంటే జిల్లా ప్రభుత్వాస్పత్రిని సంప్రదించాలన్నారు. ఎమర్జెన్సీ ఉన్న సమయంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వుండరాదని ఆదేశించారు.

టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడి

● బాలకార్మికుడికి విముక్తి

బళ్లారి సిటీ,నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సండూరు తాలూకాలోని కుడితిని, తోరణగల్లు, వడ్డు గ్రామాల రహదారులపై ఉన్న గ్యారేజీలు, మెకానిక్ దుకాణాల్లో బాల కార్మికులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం దాడులు చేశారు. ఒక బాల కార్మికుడిని వారు రక్షించారు. జిల్లా కమిషనర్ ఆదేశాల మేరకు లీగల్ సర్వీసెస్ అథారిటీ, తాలూకా టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్, తహసీల్దార్ నేతృత్వంలో దాడి చేశారు. ఓ చిన్నారి వాంగ్మూలాన్ని అక్కడికక్కడే తీసుకుని పునరావాసం కోసం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు సమర్పించారు. అవగాహన కల్పించడానికి అన్ని వ్యాపార యజమానులకు కరపత్రాలు పోస్టర్లను పంపిణీ చేశారు. టాస్క్‌ఫోర్స్ కమిటీలో డిప్యూటీ తహసీల్దార్ దేశాయ్, సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్, జిల్లా బాలకార్మిక ప్రాజెక్ట్ డైరెక్టర్ మౌనేశ్, గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారులు, బాలల సహాయ కేంద్రం సిబ్బంది కార్తీక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

నగర పీఠం దక్కేదెవరికి..?

● రేపు మేయర్, ఉపమేయర్ ఎన్నికలు
● కాంగ్రెస్ అధిష్టానం నుంచి ద్విసభ్య కమిటీ రాక
● నేడు కార్పొరేటర్లతో సమావేశం



సమావేశమైన కార్పొరేటర్లు

బళ్లారి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బళ్లారి మహానగరపాలికే మేయర్, ఉపమేయర్ అభ్యర్థుల ఎంపికకు కాంగ్రెస్ అధిష్టానం దృష్టిసారించింది. ఇందుకు సంబంధించి ద్విసభ్య కమిటీని నియమించింది. కమిటీ సభ్యులుగా పార్టీ జనరల్ సెక్రటరీలు ఆర్‌వీ వెంకటేశ్. శివరాజ్ హెగ్డేలను నియమించింది. గురువారం రాత్రి వీరు బళ్లారికి చేరుకున్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లతో సమావేశం అయి మేయర్, ఉప మేయర్ అభ్యర్థులపై అభిప్రాయ సేకరణ చేయనున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ కార్పొరేటర్లు అందరూ సమావేశానికి హాజరు కావాలని పార్టీ నుంచి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారని తెలిసింది. శనివారం మేయర్, ఉపమేయర్, నాలుగు స్థాయీ సమితి సభ్యులకు ఎన్నికలు జరగనున్నాయి. జనరల్ క్యాటగిరీకి మేయర్ స్థానం రిజర్వు కావడం వల్ల పదవి కోసం పోటీపడే వారి సంఖ్య పెరిగింది. పార్టీ పంపిన సమన్వయ కమిటీలో కార్పొరేటర్లతో పాటు నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మాజీ మంత్రి, రూరల్ ఎమ్మెల్యే బి. నాగేంద్ర, ఎంపీ (రాజ్యసభ) నాసిర్ హుసేన్, ఎంపీ(లోక్‌సభ) తుకారాం కూడా హాజరుకానున్నారని పార్టీ వర్గాల ద్వారా సమాచారం. 24వ అవధి జరిగే మేయర్ ఎన్నిక జనరల్ క్యాటగిరీకి రిజర్వు కావడంతో ఇంతకు ముందు దీన్ని సవాల్ చేస్తూ కొందరు కార్పొరేటర్లు కోర్టుకువెళ్లారు. దీని కారణంగా 6 మాసాలు ముందే జరగాల్సిన మేయర్ ఎన్నిక ఆలస్యమైందని కొందరు కార్పొరేటర్లు అంటున్నారు.

కార్పొరేటర్లతో సమావేశం

మేయర్, ఉపమేయర్ ఎన్నికలు శనివారం జరగనున్న నేపథ్యంలో ముందస్తుగా గురువారం కార్పొరేటర్లు సమావేశం అయ్యారు. దాదాపు 20 మంది సమావేశమై మేయర్, ఉపమేయర్‌ను ఎవరిని ఎన్నుకోవాలని చర్చించారు. అక్కడ ఉన్న కార్పొరేటర్లు అందరూ మేయర్‌గా మూడో వార్డు కార్పొరేటర్ ముండ్లూరు ప్రభంజన్‌ను ఎన్నుకోవాలని తీర్మానించినట్లు తెలిసింది. కార్పొరేటర్ల అభిప్రాయాన్ని శుక్రవారం జరిగే సమన్వయ కమిటీ ముందు ఉంచేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

మేయర్ ఎన్నికకు కట్టుదిట్టమైన బందోబస్తు

● డీసీ నాగేంద్ర ప్రసాద్



బళ్లారి(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగర పాలికె మేయర్, డిప్యూటీ మేయర్, నాలుగు స్థాయీ సమితీ సభ్యుల ఎంపికకు శనివారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు డీసీ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. ఎన్నికలు జరిగే స్థలంలో 500 మీటర్ల దూరం వరకూ నిషేధం ఉంటుందన్నారు. ఎవరూ గుంపులు గుంపులుగా రాకూడదని, ప్రమాద కర ఆయుధాలు, వస్తువులు చేతపట్టుకోకూడదని అన్నారు. ఎన్నికలు ముగిసే వరకూ కట్టుదిట్టమైన బందోబస్తు ఉంటుందన్నారు.

20న గని కార్మికుల సమావేశం



పోస్టర్లు విడుదల చేస్తున్న యూనియన్ నాయకులు

బళ్లారి సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గని కార్మికుల సేవా భద్రతతో సహా వివిధ డిమాండ్ల సాధన కోసం 20వ తేదీన సండూరులోని అంబేడ్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించనున్ననట్లు యునైటెడ్ మైన్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాస్ తెలిపారు. గురువారం నగరంలోని పత్రికాభవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సండూర్, బళ్లారి, హొస్పేట్ నుంచి గని కార్మికులు సదస్సులో పాల్గొంటారన్నారు. సమావేశానికి ముందు సండూర్‌లోని ఏపీఎంసీ నుంచి భారీ ఊరేగింపు ప్రారంభమై సమావేశ వేదికకు చేరేకుంటుందన్నారు. సమావేశంలో గని కార్మికుల సమస్యలు, పరిష్కారాలపై వివరణాత్మక చర్చ ఉంటుందన్నారు. గని కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు సేవా భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్టర్లు మారినప్పటికీ ఉన్న కాంట్రాక్ట్ కార్మికులను కొనసాగించాలన్నారు. శాశ్వత నియామకంలో స్థానికులకు ప్రాధాన్యం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చట్టాలను రూపొందించాలన్నారు. వేతనం, సెలవు, బోనస్, పీఎఫ్ వంటి సౌకర్యాలను నిర్ధారించాలన్నారు. గని ప్రభావిత ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ సుసంపన్నమైన సంక్షేమ ఆసుపత్రిని తిరిగి ప్రారంభించాలన్నారు. కేఎంఈఆర్సీ నిధుల నుంచి ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. సదస్సుకు యునైటెడ్ మైన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కే.సోమశేఖర్, ఏఐయూటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కే సోమశేఖర్ యాదగిరి, జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రమోద్ పాల్గొంటారన్నారు. సమావేశంలో యూనియన్ కార్యదర్శి సోమశేఖరగౌడ, ఏఐయూటీయూసీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రమోద్, శాంత పాల్గొన్నారు.

ఉగ్రదాడులపై కఠిన చర్యలు తీసుకోవాలి

● హిందూ జాగరణ వేదిక డిమాండ్

బళ్లారిరూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఇటీవల జరిగిన ఉగ్ర దాడికి కారణమైన ఇస్లామిక్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ జాగరణ వేదిక ఆధ్వర్యంలో నగరంలో నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందించారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ దేశరాజధాని ఢిల్లీలో జరిగిన ఉగ్రవాద దాడి తరువాత దేశవ్యాప్తంగా ఆందోళన వాతావరణం నెలకొందన్నారు. ఈ దాడిలో 12 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 30 మందికి పైగా గాయపడ్డారన్నారు. ఉగ్రవాది తనను తాను పేల్చుకోవడంతో ఈ విషాదం చోటు చేసుకుందన్నారు. ఈ దాడిని ఖండిస్తూ, ఘటనకు కార్మికులైన సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ జాగరణ వేదిక జిల్లా యూనిట్ సభ్యులు డిమాండ్ చేశారు. వేదిక ఉత్తర కర్ణాటక సభ్యుడు కె. శ్రీరాములు మాట్లాడుతూ కారు పేలడంతో మరణించిన ఉమర్ నబీకి అనేక ఇస్లామిక్ తీవ్రవాద సంస్థలు, మతోన్మాద వ్యక్తులతో సంబంధాలు ఉన్నాయని అనుమానిస్తున్నట్లు తెలిపారు. జాతీయ దర్యాప్తు సంస్థ, జాతీయ భద్రతా సమస్య కశ్మీర్, హర్యానాలో జరిపిన దాడుల్లో 2,900 కిలోల మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఉమర్ నబీ హర్యానా విశ్వ విద్యాలయంలో ప్రైవేటు ప్రొఫెసర్‌గా విద్యార్థులతో మతోన్మాదాన్ని రెచ్చగొట్టాడన్నారు. దేశ భద్రత నివేదికల ప్రకారం ఈ ఉగ్రవాద సంస్థల హిట్‌లిస్టులో హిందూమత ప్రదేశాలు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ కార్యాలయాలు, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో అల్లర్లు సృష్టించి ప్రాణనష్టం చేసే అవకాశాలున్నాయన్నారు. జిల్లా సభ్యులు ముల్లంగి కిషోర్ కుమార్, యర్రిస్వామి, మణికంఠ, భారత్ సోనీ మనోజ్‌కుమార్, గోవిందనాయక్, అమరేష్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న హిందూ జాగరణ వేదిక సభ్యులు

17న రాష్ట్రస్థాయి సహకార వారోత్సవాలు

● విజయవంతం చేయాలని బీడీసీసీ బ్యాంకు అధ్యక్షుడు తిప్పేస్వామి పిలుపు

హొస్పేట్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు 17వ తేదీన హొస్పేట్ నగరంలోని సురభి కల్యాణమండపంలో నిర్వహిస్తున్నట్లు బీడీసీసీ బ్యాంకు అధ్యక్షుడు తిప్పేస్వామి తెలిపారు. గురువారం నగరంలోని బ్యాంకు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ విభాగాలు, సహకార సంస్థలు, రైతు సంఘాలు చురుగ్గా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి సంవత్సరం 14 నుంచి 20వ తేదీ వరకు దేశవ్యాప్తంగా సహకార వారోత్సవాలను నిర్వహిస్తున్నారని, ఈసారి అంతర్జాతీయ సహకార సంవత్సరంగా జరుపుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర సహకార సమాఖ్య, అపెక్స్ బ్యాంకు, బళ్లారి డీసీసీ బ్యాంకు, రాయచూరు, కొప్పల్ మిల్క్ యూనియన్లు సంయుక్తంగా రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి, సహకార మంత్రిగా ఉన్నందున ప్రారంభోత్సవం బెంగళూరులో 14వ తేదీన అనంతరం రాయచూర్, మంగళూరు, హొస్పేట్, కొప్పల్ చామరాజనగర్‌లలో వరుసగా కార్యక్రమాలు ఉంటాయన్నారు. హొస్పేట్ కేంద్రంగా ఈ ఏడాది జాతీయ సహకార విధాన పర్యావరణ వ్యవస్థ భారతదేశంలో సహకార సంస్థలకు నిర్మాణాత్మక మార్గదర్శిగా నిర్ణయించినట్లు తెలిపారు. సహకార రథాన్ని సిద్ధం చేసి అందులో ముఖ్య అతిథులు, సహకార రత్న అవార్డు గ్రహీతులు పాల్గొంటారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప, జిల్లా, రాష్ట్రస్థాయి సహకార నేతలు, అధికారులు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న బీడీసీసీ బ్యాంకు అధ్యక్షుడు తిప్పేస్వామి



పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

● ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన

కంప్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని సిరిగేరి గ్రామ ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు గురువారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. పీడీవో హుస్సేన్ పీరాసాబ్‌కు వినతిపత్రం అందించారు. మహిళలు మాట్లాడుతూ గతంలో ఎస్సీ కాలనీకి నీరు సరఫరా చేయడానికి సమీపంలోని కొండపై ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించాలని ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. ఇందుకు నిధులు కూడా మంజూరయ్యాయన్నారు. మంజూరైన ఓవర్ ట్యాంక్‌ను వేరే ప్రాంతానికి మార్చారన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక గ్రాంట్‌తో కురుగోడు రోడ్డులోని సక్కరగౌడ పొలం వద్ద గొట్టపు బావిని తవ్వారని, అక్కడి నుంచి పైపులైన్ ద్వారా కాలనీకి నీటిని అనుసంధానించినట్లు తెలిపారు. 34 ఏళ్ల తరువాత ఎస్సీ కాలనీలోని కొన్ని కుళాయిలకు నీటిని సరఫరా చేశారన్నారు. అవికాక అక్కడక్కడా వ్యక్తిగత కుళాయిలకు కూడా కనెక్షన్లు ఇవ్వడం వల్ల కాలనీలో నీటి కొరత ఏర్పడిందని వాపోయారు. ఈ ప్రాంతానికి సమీపంలో దాసాపుర చెరువు నుంచి కాలువ ద్వారా తాగునీటిని విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. పీడీవో మాట్లాడుతూ నీటి సమస్యను ఇంజనీర్, అధ్యక్ష ఉపాధ్యక్షులు, గ్రామ పంచాయతీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చలు జరిపి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ద్యావన్న, డ్రైవర్ ఉలిగప్ప, పంచాయతీ సభ్యులు యర్రిస్వామి, తిప్పేస్వామి, లక్ష్మణ భండారి, సన్న ఈరన్న, ఉలిగప్ప, నాగరాజు, విజయ, పంపాపతి, మంజు, మారుతి, బసవ, దుర్గప్ప, తిప్పేశ, రామలింగ, గౌరమ్మ, హనుమంతమ్మ, గంగమ్మ, శంకరమ్మ పాల్గొన్నారు.

నకిలీ వైద్యుడి క్లినిక్ సీజ్



క్లినిక్‌లో తనిఖీలు చేస్తున్న వైద్య సిబ్బంది

బళ్లారి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా సండూరు తాలూకా తోరణగల్లులో నకలీ వైద్యుడు నిర్వహిస్తున్న క్లినిక్‌పై జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ తోరణగల్లులో అభిలాష్ అనే క్లినిక్ పేరుతో బీఎన్ వీరేష్ క్లినిక్ నడుతున్నారన్నారు. అతనికి వైద్యవృత్తి చేయడానికి ఎటువంటి అర్హత సర్టిఫికేట్ లేదన్నారు. కేవలం పదోతరగతి వరకూ మాత్రమే చదువుకున్నట్లు తేలిందన్నారు. ఇతని క్లినిక్‌లో వైద్యులు ఇంద్రాణి, భరత్ ఇతర వైద్య సిబ్బంది తనిఖీలు చేశారు. వెంటనే క్లినిక్‌ను సీజ్‌చేసినట్లు జిల్లా వైద్యాధికారి తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో కొందరు ఆర్ఎంపీ డాక్టర్ల పేరుతో వచ్చీరాని వైద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నారన్నారు. కొందరు ఆర్ఎంపీలు కాన్పులు చేస్తున్నారని, తల్లిగర్భంలో ఉన్న పిల్లల లింగం గురించి తెలుపుతున్నారని అన్నారు. ప్రజలు నకలీ వైద్యుల వద్దకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన వైద్యశాలలకే వెళ్లాలని సూచించారు.

వంతెన నిర్మాణానికి సర్వే



సర్వే చేస్తున్న పీడబ్ల్యూడీ అధికారులు

కంప్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కంప్లి కోటే వద్ద తుంగభద్ర నదిపై నూతన వంతెన ఏర్పాటు కోసం కలబురగి విభాగం ప్రజాపన్నుల శాఖ చీఫ్ ఇంజనీర్ శరణప్ప, సులేగుంట పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ వంతెన విషయంపై తమకు ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిశీలించాలని ఆదేశించినట్లు తెలిపారు. అందుకు తాము వంతెనను పరిశీలిస్తున్నామని తెలిపారు. గతంలో పీడబ్ల్యూడీ ప్రజా గనుల శాఖ ప్రజాప్రతినిధులు మంత్రి, ఎమ్మెల్యేలు ఇక్కడ వంతెనను పరిశీలించినట్లు తెలిపారు. వర్షాకాలంలో నదికి ఎక్కువగా నీరు పోటెత్తితే కంప్లి, గంగావతి రాకపోకలు బంద్ అయ్యి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం కూడా తెలిసిందన్నారు. ఇప్పుడున్న వంతెన కూడా బరువైన వాహనాలు వెళ్లడంతో కాస్త ధ్వంసమైనట్లు తెలిపారు. ఈ వంతెన వల్ల బళ్లారి కొప్పళ జిల్లాలకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు వెళ్లేందుకు కూడా అనుకూలంగా వుందన్నారు. ఒకవేళ ఈ వంతెన కూలితే ఈ రెండు జిల్లాల వారికి కష్టంగా ఉంటుందన్నారు. వంతెన పరిశీలించిన విషయంపై నదికి ఇరువైపులా రైతులకు, విద్యార్థులకు ప్రజలకు ఎంత ముఖ్యమో రాష్ట్ర ప్రజాపన్నుల శాఖ అధికారులకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో తిమ్మరాయప్ప, హేమంత్‌రాజ్, హేమరాజు, విశ్వనాథ్, బసవరెడ్డి, ఆనంద్, తస్లీమ్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై దృష్టి పెట్టాలి

● పంచాయతీ సీఈఓ నోంగ్యాజాయ్ మహ్మద్ ఆలీ అక్రమ్



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ మెరుగైన భవిష్యత్తు కోసం పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని విజయనగరం జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి నోంగ్యాజాయ్ మహ్మద్ ఆలీ అక్రమ్ కోరారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హొసపేటలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కేరీర్ గైడెన్స్ పోటీ పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. విద్యార్థి జీవితం చాలా విలువైనదని, దానిని ఎట్టి పరిస్థితుల్లో వృథా చేయరాదన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి, మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవడానికి నిరంతరం అధ్యయనం చేయాలని అన్నారు. అందరికీ చదువుకునే అవకాశం ఉండదని, విద్యార్థులు తమకు లభించిన విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవలన్నారు. ప్రతిరోజూ యోగా, ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో విజేతలకు అవార్డు, సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జావెద్, కారంగి, సినిమా ఫౌండేషన్ అధిపతి అమీన్, ముదాసిర్, సయ్యద్ బాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

హొసూరు జోన్

గిరిజనుల స్వావలంబనకు ప్రత్యేక శిబిరం



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హొసూరు(కృష్ణగిరి), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ గిరిజన సంక్షేమ హక్కుల చట్టం 2006 కింద అటవీభూములలో నివసించే గిరిజనులకు, సంప్రదాయకంగా అటవీ ఆధారిత ప్రజలకు అడవులపై వారి హక్కులను కాపాడుకోవడానికి, వారి జీవనోపాధిని మెరుగుపరచుకోవడానికి కొన్ని హక్కులను కల్పించింది. గిరిజనుల స్వావలంబనకై చైతన్యం కల్పించేలా స్వయంగా కలెక్టర్ దినేశ్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. 2005కి ముందు అడవులలో నివసిస్తున్న, భూమిని ఆక్రమించి, సాగు చేస్తున్న వారికి వర్తిస్తుంది. గురువారం ఏర్పాటైన సమావేశంలో అటవీ ప్రాంతాలలో నివసించేవారి హక్కులు, బాధ్యతల గురించి కలెక్టర్ దినేశ్‌కుమార్ వివరించారు. అటవీప్రాంతాలలో ఏదైనా తప్పు జరిగితే స్థానికులు వెంటనే అటవీశాఖకు తెలియచేయాలన్నారు. జిల్లాలోని నరికురవ ప్రజలు మంచి పూసల దండలు తయారు చేస్తున్నారని, కృష్ణగిరి బస్టాండు వద్ద పూసల దండలు అమ్మడానికి ఒక దుకాణం ఏర్పాటుకు డిమాండ్ ఉందన్నారు. ఆసక్తిగలవారికి తక్కువ అద్దెకు వెంటనే కేటాయిస్తారన్నారు. ప్రభుత్వ రుణ సౌకర్యాలు, మీ పిల్లలకు మంచి విద్య అవకాశాలు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథకం డైరెక్టర్ కవిత, జిల్లా ఆది ద్రావిడ సంక్షేమ అధికారి శివకుమార్, తాలూకా అధికారి రమేశ్, అభివృద్ధి అధికారులు కళా, కార్తీ, ఫారెస్టర్ పళని, యూనియన్ కమిటీ మాజీ సభ్యుడు నాగేశ్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయండి



నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

హొసూరు. నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నిరాశ్రయులైన వారికి ఉచిత ఇంటిస్థలాలు, పట్టాలేని వారికి పట్టాలు ఇవ్వాలని తమిళనాడు రైతు సంఘం డిమాండ్ చేసింది. హొసూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు గురువారం నిరసన తెలిపారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రన్ నేతృత్వంలో కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్, తమిళనాడు రైతు సంఘం, జిల్లా అధ్యక్షుడు మురుగేశ్ తదితరులు పాల్గొన్నారు, వందలాది మంది ప్రజలు నిరసనలో భాగస్వామ్యులై నినాదాలు చేశారు. సబ్ కలెక్టర్ ఆకృతిశెట్టికి వినతిపత్రం అందించేందుకు ప్రయత్నించారు. ఆన్‌లైన్ మీటింగ్‌లో ఉండడంతో కొద్దిసేపు వేచి యుండాలని సిబ్బంది సూచించారు. ఇందుకురైతు సంఘాలు ఆగ్రహంతో ప్రవేశం ద్వారం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. కొంత సమయం తరువాత సబ్‌కలెక్టర్ వచ్చి వినతిపత్రం స్వీకరించారు. అనంతరం నిరసన వీడి వెనుతిరిగారు.

మంత్రి సమక్షంలో డీఎంకేలోకి చేరిక

హొసూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాకు చెందిన అన్నాడీఎంకే నాయకులు పౌర, ఆహార సరఫరాల శాఖ మంత్రి చక్రపాణి సమక్షంలో చేరారు. కృష్ణగిరి పశ్చిమ జిల్లా అన్నాడీఎంకే జిల్లా సమాచార సాంకేతిక విభాగం అధ్యక్షుడు, హొసూరు నగర తూర్పు జోన్ కమిటీ అధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, అన్నాడీఎంకే హొసూరు సౌత్ యూనియన్ డిప్యూటీ సెక్రటరీ నవీన్ కుమార్‌లు డీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా డీఎంకే జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే వై.ప్రకాశ్, హొసూరు సౌత్ యూనియన్ ఇన్‌చార్జ్ రామూర్తి పాల్గొని వారిద్దరికి శాలువాతో సత్కరించారు. కాగా ఆదివారం ఏర్పాటయ్యే కార్యక్రమంలో డీఎంకేలోకి 2వేలమంది అనుచరులు చేరుతారని పురుషోత్తమరెడ్డి, నవీన్‌కుమార్ తెలిపారు.




శాలువాతో సత్కరిస్తున్న మంత్రి చక్రపాణి

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

జవహర్‌లాల్ నెహ్రూ (జయంతి)




దేశ తొలి ప్రధానమంత్రి, 'భారతరత్న' గ్రహీత జవహర్‌లాల్ నెహ్రూ 1889 నవంబరు 14న అలహాబాద్ (ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్)లో జన్మించారు. ప్రధానిగా ఎన్నికై 18ఏళ్లపాటు కొనసాగారు. స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత కూడా. పండిట్ నెహ్రూగా, చాచా నెహ్రూగా పేరొందారు. రచయిత, చరిత్రకారుడు కూడా. స్ఫూర్తిదాయక రచనలు చేశారు. దేశ అభివృద్ధికి ఎన్నో సంక్షేమాలు అమలు చేశారు. జాతీయస్థాయి విద్యావిధానం అమలుచేసి మారుమూల పల్లెలకు సైతం విద్య అందేలా చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఆయనో సింబల్‌గా మారారనడంలో అతిశయోక్తి లేదు. ఆయన పుట్టినరోజును 'బాలల దినోత్సవం'గా ఆచరిస్తారు. 1964 మే 27న కన్నుమూశారు.

నేతి శ్రీరామశర్మ (జయంతి)



నేతి శ్రీరామశర్మ 1928 నవంబరు 14న కృష్ణా జిల్లా విశాఖపట్నంలో జన్మించారు. సంగీత విద్వాంసుడు. విజయవాడలో గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వద్ద వయోలిన్, గాత్రసంగీతాన్ని గురుకుల పద్ధతిలో నేర్చుకున్నారు. 'ఆకాశవాణి' నిలయ విద్వాంసులుగా విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్‌లలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. వందలాదిమందికి గురుకుల విధానంలో బోధనలు చేశారు. రేడియో ద్వారా సైతం సంగీత పాఠాలు నిర్వహించారు. శిష్యులు ఆత్మీయంగా 'సంగీతానంద' బిరుదుతో సత్కరించారు. 2012 మే 2న కన్నుమూశారు.

శ్రీల ప్రభుపాద (వర్ధంతి)



అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) సంస్థాపకుడు అభయ చరణారవింద భక్తివేదాంత స్వామిగా పేరొందిన శ్రీల ప్రభుపాద 1896 సెప్టెంబరు 1న కోల్కత్తాలో జన్మించారు. ఆధ్యాత్మికవేత్త. ఎహరే కృష్ణ ఉద్యమంతో ప్రజలలో భక్తిభావాలు పెంపొందించారు. శ్రీమద్భాగవతములోని 18వేల శ్లోకాలను అనువాదము, వ్యాఖ్యానాలతో కూడిన అనేక సంపుటాలను రచించారు. 1977 నవంబరు 14న పరమపదించారు.

గీతా సుబ్బారావు (పుట్టినరోజు)



'గీతా' సుబ్బారావు 1942 నవంబరు 14న విజయనగరంలో జన్మించారు. అసలు పేరు పిళ్లా సుబ్బారావు. గీతా సుబ్బారావుగానే పేరొందారు. రచయిత, కార్టూనిస్టు. దాదాపు మూడు దశాబ్దాలపాటు గీతా పేరుతో కార్టూన్‌లు గీశారు. సినిమావాళ్ళందరికీ పబ్లిసిటీ కింగ్‌గా కూడా ఆయన ఆత్మీయుడు. సెన్సార్ బోర్డు సలహా మండలి సభ్యుడు. తెలుగులో తొలి ప్యాకెట్ డైలీ కార్టూన్‌లు వేసిన క్రెడిట్ బహుశా ఆయనకే దక్కుతుంది. బాల సాహిత్య రచయిత, తదితర గౌరవాలు పొందారు. ఈయన రచనలు పలు భాషల్లోకి తర్జుమాతో కొన్ని సినిమాలుగా విడుదలయ్యాయి.

యండమూరి వీరేంద్రనాథ్ (పుట్టినరోజు)



ప్రముఖ రచయితగానే కాక వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా పేరొందిన యండమూరి వీరేంద్రనాథ్ 1948 నవంబరు 14న తూర్పు గోదావరి జిల్లా రాజోలులో జన్మించారు. తెలుగులో సుప్రసిద్ధ నవలా రచయిత. ఆయన రాసిన నవలలు కొన్ని సినిమాలుగా కూడా వచ్చాయి. వృత్తి రీత్యా చార్టెర్డ్ అకౌంటెంట్. పదేళ్లపాటు ఆంధ్రా బ్యాంకు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ విభాగాధిపతిగా పనిచేవారు. పూర్తిస్థాయి రచయితకోసం తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆయన నవలలు ఎంతోమందిని ప్రభావితం చేశాయనడంలో అతిశయోక్తి లేదు. 35 నవలలు, వందలాది బాలల రచనలు చేశారు. సాహిత్య అకాడమీ, నంది అవార్డులు పొందారు.

ప్రిన్స్ ఛార్లెస్ (పుట్టినరోజు)



ప్రిన్స్ ఛార్లెస్-3 లండన్ దేశంలోని బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో 1948 నవంబరు 14న జన్మించారు. కింగ్ జార్జ్ 4, రాణి ఎలిజబెత్‌ల తొలి మనవడు. 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్'గా సుదీర్ఘకాలం కొనసాగారు. పర్యావరణంపైనా, సేంద్రియ సాగుపై ప్రజలలో జాగృతి కల్పించారు. హోమియోపతి వైద్య విధానానికి తన వంతు మద్దతు తెలిపారు. రచయితగా, సహరచయితగా పుస్తకాలు రాశారు. 1976లో ట్రస్టు ద్వారా సామాజికసేవలు కొనసాగిస్తున్నారు. ప్రిన్స్ విలియం, హారీలు ఆయన మాజీ భార్య డయానా కుమారులు.

సోఫియా కెనిన్ (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన టెన్నిస్ క్రీడాకారిణి సోఫియా అన్నా కెనిన్ 1998 నవంబరు 14న జన్మించారు. నిక్ నేమ్ సోన్యా. డబ్ల్యూటీఏలో నాల్గవ ర్యాంకుగా నిలిచారు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను సాధించారు. వింబుల్డన్ పోటీల్లోనూ పాల్గొని ప్రతిభ కనబరిచారు. వరల్డ్ టెన్నిస్ టీమ్ పోటీలలోనూ పాల్గొన్నారు. ఫిలడెల్ఫియా జట్టు ముందంజలో సాగేందుకు తనవంతు సహకారం అందించారు. చైనా ఓపెన్ 2023లోనూ సత్తా చాటారు. 5 డబ్ల్యూటీఏ సింగిల్స్ టైటిల్స్, రెండు డబ్ల్యూటీఏ డబుల్స్ టైటిల్స్ సాధించారు. 2024 ఆగస్టులో డబుల్స్ ర్యాంకింగ్‌లో 26వ స్థానంలో నిలిచారు.



ఎద్దులకు హారతి ఇస్తున్న మంత్రి చలువరాయస్వామి



జానపద నృత్యం చేస్తున్న కళాకారులు

కృషిమేళాలో సందర్శకుల సందడి

బెంగళూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో జీకేవీకే ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన కృషిమేళాకు సందర్శకులు పోటెత్తారు. కృషిమేళా మధ్యాహ్నం ప్రారంభమైనా విద్యార్థులు, రైతులు, మహిళా రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. మధ్యాహ్నం ఎక్కడ చూసినా జనసందడి అనిపించింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో కొనుగోళ్ళు జోరుగా సాగాయి. వివిధ రకాల పంటల సాగుకు సంబంధించి నమూనా ప్లాట్‌లలో యువతులు, విద్యార్థులు ఫొటోలు తీసుకునేందుకు ఎగబడ్డారు. పలు సెల్ఫీ పాయింట్‌ల వద్ద సందడి అనిపించింది. హళ్ళికార్ ఎద్దుల వద్ద ఫొటోలు తీసుకునేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపారు. ఏకంగా 750స్టాల్‌లు ఉండటంతో సందర్శకుల కోరుకున్న వస్తువులు కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. 8.51లక్షల మంది రైతులు, ప్రజలు పాల్గొన్నారు. 11.86లక్షల మంది భోజనం చేశారు. రూ. 62లక్షల మేర వ్యాపారం జరిగినట్లు కృషిమేళా ప్రతినిధులు ప్రకటించారు.



తోటలో అందాలను కెమరాలో బంధిస్తూ..



నవధాన్యాల ప్రదర్శన



సెల్ఫీ పాయింట్‌లో అమ్మాయిల సందడి

రేపు న్యాయ సాక్షరత కార్యక్రమం

● జిల్లా న్యాయాధికారి మారుతి బగాడె



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి మారుతి బగాడె

రాయచూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని పండిత్ సిద్ధరామ్ జంబలదిన్ని రంగమందిరంలో 15న న్యాయ సాక్షరత కార్యక్రమంతో పాటు మెగా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశామని జిల్లా ప్రధాన న్యాయాధికారి, న్యాయసేవా ప్రాధికార అధ్యక్షుడు మారుతి బగాడె తెలిపారు. జిల్లా కోర్టు కాంప్లెక్స్ వద్ద గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయ సాక్షరత కార్యక్రమాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రారంభిస్తారని, కర్నాటక హైకోర్టుకు చెందిన పలువురు సీనియర్ న్యాయమూర్తులు, న్యాయవాదులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. చట్టపరమైన రక్షణ వంటి అంశాల గురించి జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య శిబిరంలో వివరిస్తారని దేవదాసి మహిళల రక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి అడిషనల్ జిల్లాధికారి వివరిస్తారన్నారు.

మంచి వ్యక్తిత్వంతోనే మానసిక స్థైర్యం

హిందూపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మంచి వ్యక్తిత్వమే మానసిక స్థైర్యమని బెంగళూరు జైన్ విశ్వవిద్యాలయ సైకాలజిస్ట్ ధాత్రి అన్నారు. గురువారం ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో ఎన్ఎస్ఎస్, రెడ్‌రిబ్బన్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదే కళాశాలలో చదివి బెంగళూరులో సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్న ధాత్రి హాజరై మాట్లాడారు. విద్యార్థినులకు, యువతకు ఆదర్శ భావాలు, మంచి వ్యక్తిత్వమే అతిపెద్ద మానసిక బలమని తాత్కాలిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ ఒత్తిడిని జయించాలన్న సంకల్పం పెంచుకుని విజయం కోసం పోరాడాలన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు మానసికంగా కుంగిపోకుండా ధైర్యంగా ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రగతి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశు, రెడ్‌రిబ్బన్ క్లబ్ ఇన్చార్జ్ అమరేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వైర విహారం చేస్తున్న వీధికుక్కలు

రాయచూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా గోరుబాళ గ్రామంలోలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కొన్ని రోజులుగా గ్రామంలో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు మూగజీవాల పైనేగాక మహిళలు, బాలలపై కూడా దాడులకు దిగుతున్నాయంటు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం గ్రామానికి చెందిన రైతు దుర్గప్పకు చెందిన మేక పై దాడి చేయడంతో రూ.12 వేలకు పైగా విలువ చేసే మేక ప్రాణాలు కోల్పోయింది. పక్కనే ఉన్న రవి కుమార్ అనే వ్యక్తికి సంబంధించిన కోళ్ల పై దాడి చేయడంతో దాదాపు 2 వేలకుపైగా విలువైన కోళ్లు మృత్యువాతపడ్డాయి. దీంతో గ్రామస్థులు తీవ్ర అసహనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పలువురు పిల్లలపై కూడా కుక్కలు దాడి చేశాయని వాటిని నియంత్రించాలని అధికారుల వద్ద మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదంటు గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా గ్రామంలో వెలసిన మాంసం దుకాణాల వద్ద వ్యర్థాలను విచ్చల విడిగా బయట పారవేస్తుండడంతో వాటిని తినేందుకు గుంపులు గుంపులుగా వస్తున్న కుక్కలు మాంసానికి అలవాటుపడి మూక జంతువులపై దాడికి దిగుతున్నాయని వీటిని నియంత్రించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

● ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గర్భిణులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు సూచించారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం, శిశు సంరక్షణ, తల్లిపాలు ఇవ్వడం, టీకాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. పిల్లల్లో ఏవైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తీసుకురావాలని అన్నారు. 5 సంవత్సరాలకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు శ్వాస తీసుకోవడంలో సమస్యలుంటే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని అన్నారు. తీవ్రమైన రక్తహీనత ఉన్న సందర్భాల్లో ఐఎఫ్ఏ మాత్రలు, ఐరన్ సుక్రోజ్, స్థానిక చికిత్స తీసుకోవాలన్నారు. సమస్యలు ఉన్న గర్భిణులు ముందస్తు సమాచారం అందించి ప్రసవానికి జిల్లా ఆసుపత్రికి సిఫార్సు చేయాలన్నారు. అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ టి.రామకృష్ణ, ప్రసూతి వైద్యులు శారద, డాక్టర్ అరుణ్‌కుమార్, మహమ్మద్ ఖాసీం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఏఐతో సృజనాత్మకతకు ముప్పు: మాజీ ఎంపీ



స్నాతకోత్సవంలో పట్టాలు పొందిన విద్యార్థులతో మాజీ ఎంపీ రాజీవ్‌గౌడ

బెంగళూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధస్సు (ఏఐ)పై ఎక్కువగా ఆధారపడడం వల్ల సృజనాత్మకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ ఎంవీ రాజీవ్‌గౌడ అన్నారు. గురువారం సౌందర్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్స్ ఆధ్వర్యంలో స్నాతకోత్సవంలో ఎంబీఏ, ఎంకామ్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేసి మాట్లాడారు. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంలో కీలకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మన పనులకు సహకారిగా ఉండాలని అయితే పూర్తిగా దానిపై ఆధారపడడం సరికాదన్నారు. ఏఐను అతిగా వాడితే మనలోని సృజనాత్మకతను ప్రోత్సహించడం సాధ్యం కాదన్నారు. వృత్తిపరంగా ఏఐను వినియోగించుకుంటే పర్వాలేదని, ఏఐకు మించి ఎంత ధైర్యంగా ఆలోచించారనే అంశం స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. మూల పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని, మీలోని కుతూహలమే మీ భవిష్యత్తుకు మార్గం చూపుతుందన్నారు. వివేకవంతంగా ఆలోచించి, మీ హద్దులను దాటి ఎదగాలన్నారు. సౌందర్య ఎడ్యుకేషన్ ట్రస్టు సీఈఓ కీర్తన్‌కుమార్, అధ్యక్షులు సౌందర్య మంజప్ప, ఎండీ సునితా మంజప్ప తదితరులు పాల్గొన్నారు.



పరుగు పరీక్షలో పాల్గొన్న అభ్యర్థులు

తరలివచ్చిన అగ్నివీర్‌లు

(5వపేజీ తరువాయి)సాధించిన వారికి ఇక్కడ శారీరక పరీక్షలు నిర్వహిస్తున్నారు. బళ్లారి, విజయనగరం, చిత్రదుర్గ, బెంగళూరు అర్బన్, బెంగళూరు రూరల్, కోలార్, చామరాజనగర్, చిక్కబళ్లాపూర్, రామనగర, కొడగు, మండ్య, మైసూరు, హాసన్ జిల్లాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. ప్రతి రోజూ ఉదయం 4-30 గంటల నుంచి పరీక్షలు ప్రారంభం అవుతాయి. మొదటి 1.6 కి.మీ పరుగు, పుల్-అప్ జంప్, జంప్, జిగ్-జాగ్, శరీరక కొలతలు, ఎత్తు, శరీరలోతు తదితర పరీక్షలు అధికారులు నిర్వహిస్తున్నారు. ప్రతి దానిలో ఉత్తీర్ణులై తదుపరి దానికి అర్హులు అవుతారు. శారీరక పరీక్షల్లో అర్హత సాధించిన వారికి డాక్యుమెంట్ వెరిఫికేషన్ , వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ వివేక్ జామ్‌దార్ తెలిపారు. దూరప్రాంతాల నుంచి నియామకాల కోసం వచ్చే అభ్యర్థులకు అవసరమైన వారికి ఆహారం, అల్పాహారం, రవాణా, వసతి కోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఇక్కడ ఉత్తీర్ణులైన వారికి డిసెంబరు నుంచి ఆరు నెలల పాటు శిక్షణ ఉంటుంది, వీరికి ఉద్యోగం నాలుగు సంవత్సరాలు మాత్రమే ఉంటుందన్నారు.



అభ్యర్థులకు ట్యాగ్‌లు వేస్తున్న ఆర్మీ అధికారులు



ఆనందంలో పరుగు విజేతలు

ప్రాధికార అభివృద్ధికి సహకారం

(5వపేజీ తరువాయి) ఎన్ మంజుల పాల్గొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 7న ప్రాధికార ఏర్పాటైంది. సమావేశంలో ప్రాధికార పరిధిలోని సంస్థల అభివృద్ధి, వార్షిక నిర్వహణ గురించి విస్తృతంగా చర్చించారు. డాక్టర్ హెచ్ఎన్ సైన్స్ సెంటర్ సమీపాన జీవవైవిధ్య ఉద్యానవనాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి అభివృద్ధి చేసే అంశంపైనా, 132 ఎకరాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మాదిరి వాటర్‌షెడ్ కార్యక్రమాలు, ప్రాధికార పరిధిలోని సంస్థల టూరిజం సర్క్యూట్ ఏర్పాటుపైనా చర్చించారు. ప్రాధికార సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి బోసరాజు తెలిపారు. శాస్త్రవేత్తలు భవిష్యత్తు అవసరాలను గమనించి, పరిశోధనలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు సంపూర్ణ సాంకేతిక అందించాలన్నారు. సమావేశంలో ఇస్రో మాజీ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్‌కుమార్, కర్నాటక చిత్రకళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ బీఎల్ శంకర్, ఐఐఎస్‌సీ రిటైర్డు ప్రాధ్యాపకులు కేపీజే రెడ్డి, ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ అశోక్ రాయచూరు తదితరులు పాల్గొన్నారు.